# మామూలు కథ

బొలారంనుంచి సికింద్రాబాదుకు వచ్చిన లోకల్ ట్రెయిన్ రద్దీగా వుంది. కూర్చునేందుకే కాదు. దించునేందుకుకూడా చోటులేదు

"ఛీ ఛీ హైద్రాబాద్‌లో ట్రాన్స్‌పోర్టు సౌకర్యం ఎప్పుడు బాగు పడుతుందో" అన్నాడు స్వామినాథం చిరాకుగా.

నేనునవ్వి వూరుకున్నాను. ఎప్పుడూ తెల్లబట్టలే వేసుకొనే స్వామినాథం ఆ రోజు అప్పుడే మడతవిప్పిన తెల్లబట్టలు తొడుకున్నాడు నలిగిపోతున్నాయి అవి.

"మొహం మీద నీళ్ళు చల్లండి"

—"పక్కకి తప్పుకోండి. గాలి ఆడ నివ్వండి"

—"ఫిట్స్ అది., నీళ్ళు తాగించాలి" అకస్మాత్తుగా రకరకాల మాటలు వినబడ్డాయి కంగారుగా. అటుచూసాం కాని ఏమీ కనబడలేదు.

"ఏమిటి?" అడిగాడు స్వామినాథం తన పక్కన నించుని వున్న వ్యక్తిని.

తనకు తెలియదన్నట్లుగా తల అడ్డంగా వూపాడతను.

"ఎవరికో హిస్టీరియా వచ్చినట్లుంది" ఇంకో వ్యక్తి చెప్పాడు స్వామినాధన్‌కి.

రైలు సికింద్రాబాదు స్టేషన్‌లో ఆగింది కొన్ని క్షణాలలో. అంతదాకా జైల్లో వుండి విడుదల లభించిన ఖైదీల్లాగా ఒక్కసారిగా ప్రయాణీకులంతా కంపార్ట్‌మెంట్ లోంచి బయట పడసాగరు గబగబా.

"పద" అన్నాను రైలు దిగి

స్వామినాథం దిగలేదు. నిమిషంలో కంపార్ట్‌మెంట్ ఖాళీ అయి అయిపోయింది అయినా లోపల ఏదో చేస్తున్నాడు. నాకు చిరాకేసింది. మా బస్సు బయలుదేరే టైం అయింది.

"త్వరగా వెళ్ళకపోతే బస్సులోకూడా సీట్ దొరకను" అంటూ నేను మళ్ళీ లోపలికి వెళ్ళాను.

స్వామినాథం ఓ ఖాళీ సీట్‌మీద కూర్చుని వున్నాడు. అతని ప్రక్కన ఓ నలభై అయిదేళ్ళ వక్తి సీటుకు చేరగిలబడి కూర్చునివున్నాడు అతని కళ్ళు మూసుకుని వున్నాయి. గుప్పిళ్లు బిగించి వున్నాయి. నోట్లో నుంచి సన్నగా నురగ వస్తోంది

స్వామినాథం నావంక చూసాడు కొన్నిక్షణాలు తర్వాత అతని కుడిచేతి గుప్పెటని బలవంతంగా తెరచి ఆ అరచేతిలో ఇనప తాళం చెవి ఒకటి వుంచాడు. నేను అవాక్కయి పోయి అలాగే చూస్తూ నిల్చున్నాను.

ఎంత సేపయిందో తెలియలేదు దాదాపు అయిదు నిమిషాల తర్వాతనుకుంటాను మూర్ఛవచ్చిన అతను తేరుకున్నాడు. ఎంతో నిస్త్రాణంగా వుంది అతనికి

అప్పటికే స్వామినాథం తన జేబురుమాలతో అతని నోటిని శుభ్రంగా తుడిచాడు అతను కళ్ళు విప్పి నీరసంగా చూసాడు స్వామినాథం వంక.

"ఇప్పుడు పర్వాలేదా?" అడిగాడు స్వామినాథం.

అతను తల వూపాడు.

"లేచి నడవగలరా?"

మళ్ళీ తలవూపి లేచాడు.

స్వామినాథం అతని కుడిచేతిలో వుంచిన తన తాళం చెవిని తీసుకున్నాడు. రుమాల కిటికీ లోంచి బయటకి పారేసి తనూ లేచాడు.

"థాంక్స్" అన్నాడతను రెండు చేతులు జోడించి.

ఆ నమస్కారం చేసిన విధంలోనే అతనికి స్వామినాథం మీద ఏర్పడ్డ కృతజ్ఞతా భావం కనపడింది అధికంగా.

"సార్, మీ టైం పాడుచేసాను" అన్నాడతను.

నా చేతి గడియారం వంక చూసుకున్నాను అప్పుడు.

ఆఫీసు కెళ్ళే మా బస్సు అప్పటికే వెళ్ళిపోయి వుంటుందనుకున్నాను.

ముగ్గురం ప్లాట్‌ఫారం మీదకు వచ్చాం. అతను నీళ్ళపంపువైపు వెళ్ళాడు మొహం కడుక్కోడానికి. మేం ఇద్దరం బయటకి నడిచాం స్వామినాథం చేతులు కడుక్కున్నాక.

"బస్సు వెళ్ళిపోయింది" అన్నాడు స్వామినాథం ఖాళీ బస్‌స్టాప్‌ని చూసి.

"ఇవాళ ఆఫీసుకు అరగంట లేటు."

ఆ తర్వాత మేం మౌనంగా వుండిపోయాం. ఆఫీసుకు చేరుకున్నాక ఆఫీసర్ గదిలోకి వెళ్ళాం అటెండెన్స్ రిజిష్టర్ అప్పటికే ఆయన గదిలోకి వెళ్ళటంవల్ల.

మేం సంతకాలు చేసాక అడిగాడు కోపంతోకూడిన అధికారంతో.

"ఆలస్య మయిందేం?"

జరిగింది చెప్పాడు స్వామినాథం.

"ఇంకోసారి ఇలా లేటయితే నేను వూరుకోను. హెడ్ ఆఫీస్‌కి రిపోర్ట్ చేయాల్సివుంటుంది అయినా ఆయన మీకు బంధువా స్నేహితుడా!" కోపంగా కసిరాడు

మారు మాట్లావకుండా బయటకి వచ్చాం ఇద్దరం.

"సారీ గురూ. నావల్ల నీకుకూడా మాటొచ్చింది" అన్నాడు స్వామినాథం కొదిగా బాధగా.

"ఇట్సాల్‌రైట్" అన్నాను.

మర్నాడు వుదయం మళ్ళీ బొలారం రైల్వేస్టేషన్‌లో కలిసాం. స్వామినాథం నా చేతిలో ఓ కవరు వుంచి చెప్పాడు.

"నిన్న జరిగిన సంఘటన ఆధారంగా కథ రాసాను. చదువుతావా?"

తల వూపి కవరులోంచి స్టేపిల్ చేయబడ్డ ఎనిమిది అరఠావు కాగితాలని బయటకితీసాను.

రైలు వచ్చేలోగా పది నిమిషాల్లో చదివేసాను ఆ కథని. అంతా జరిగింది జరిగినట్టుగానే రాసాడు స్వామినాథం. కాని చివరలో ఓ మార్పు చేసాడు, ఆఫీసర్ మమ్మల్ని కోప్పడ్డాడు గదా.

కాని కథలో మాత్రం అలా జరగదు. ఆలస్యానికి కారణం అడుగుతే జరిగింది చెప్తాడు స్వామినాథం. ఆఫీసర్ చాలా సంతోషపడతాడు అది విని. మిగతా స్టాఫ్‌ని పిలిచే జరిగింది చెప్తాడు. చాలామంది తమ అభినందనలు తెలియచేస్తారు స్వామినాథానికి.

"నీ కోరికని ఈ విధంగా కథద్వారా తీర్చుకుంటున్నావా?" అడిగాను నవ్వి.

"ఏం కోరిక?"

"ఆపీసర్ మెచ్చుకోవడం."

"అది నా కోరిక కాదు ఎలా వుంది కథ?"

"చాలా మామూలుగా వుంది "

"డల్‌గానా?" .

"అది సరయిన పదం. ఏ ఆఫీసరూ నువు రాసిన కథలోలాగా ప్రవర్తించడు. అందులో మనం స్వయంగా అనుభవించాంగా."

నవ్వాడు

"నిటమే. మన మొరేల్ ఎంత హీనస్థితికి దిగజారిందంటే, కథలో ఏ మనిషయినా మనం వూహించే విధంగా కాక–లేదా మనం ప్రవర్తించే విధంగా కాక–ఏమాత్రం వున్నతంగా ప్రవర్తించినా ఆ కథ "అసహజం బావుండలేదు" అంటాం. ఆఫీసర్ ఎలా ప్రవర్తించాడని కాదు. ఎలా ప్రవర్తించాలి అని ఈ కథలో రాసాను."

స్వామినాథం మాటలుగురించి ఆలోచిస్తుండగా నన్ను ప్రశ్నించాడు.

"చిన్నప్పుడు "గుడ్ సమారిటన్" పాఠం చదువుకోలేదా? మనకా పాఠం నేర్పడంలోని వుద్దేశం ఏమిటి?"

రైలు రావడంతో నేను బదులు చెప్పకుండా స్వామినాథం చెయ్యి పట్టుకుని అటు వైపు నడిచాను.

❋